# తెగింపు

## పి.వి.బి శ్రీరామమూర్తి



**చంద్రమ్మ** వస్తూనే చేదా, పెద్ద బకెట్టూ ఘాలికి పట్టు కెళ్ళి రెండుకుండల నిండా నీళ్ళూ నింపేసింది. ఇంట్లోకి కుళాయి నీరు తెచ్చి పెట్టేసింది. అంట్లు చకచకా తోమేసి వెళ్ళటానికి సిద్ధమై "వస్తానమ్మా!" అని నిలుచుంది.

గిరిజకు ఆశ్చర్యం అయింది.

చంద్రమ్మ ఉట్టి వాగుడుకాయ. వచ్చిన దగ్గరనుంచి ఎక్కడలేని కబుర్లూ చెప్పేస్తూ ఉంటుంది. తను పనిచేసే పదిళ్ళలో జరిగే సంగతులూ, పట్నంలో మారే సినిమాలూ, అది చూపిన సినిమాల్లో దానికి నచ్చిన సంఘటనలూ అలా వర్ణిస్తూనే ఉంటుంది. కబుర్లు ఎంతలా చెప్పినా అరగంటలో దాని పని అది పూర్తిచేసేసు కుని వెళ్ళిపోతుంది. అదొచ్చి వెళితే గాలి వాన వచ్చి వెలిసినట్లే ఉంటుంది. అలాంటిది ఉదయం నించి ఇవాళంతా దాని పని అది చేసుకు వెళుతూందే కానీ ఒక ఉలుకూ, పలుకూ లేదు. "ఏమే, చంద్రీ! ఇవాళ హుషారుగా లేవు. పొద్దుటినుంచీ చూస్తున్నాను" అంది గిరిజ.

చంద్రి భారంగా నిట్టూర్చింది. పైటతో ముఖానికి పట్టిన చెమటని తుడుచేసు కుంటూ, "ఏం జలమనమ్మా? ఈ ఎదవ ఆడజల్మం ఎత్తిన కంటే కుక్క జల్మం ఎత్తితే మంచిదమ్మా" అంది.

"నీ కే మొచ్చిందే? ఇవా ళింత విరాగినయి పోయావు" అంది.

"అవునమ్మా. ఆ సీతమ్మోరి నుంచి నాలాటి ఆడదాయి దాకా చూసినా ఏ ఆడదాయి సుకపడ్డాది సెప్పండి? రెక్కలు ముక్కలు సేసుకుని నానా కట్టాలూ పడినా, ఇంటికాడ సిటం తీరకనేక గొడ్డు సేకిరీ సేసినా, ఆడదాయి నింకా పాదాల్లో ఆడిసీయాలనే ఈ మొగోడు సూత్తాడు గానీ, 'అయ్యో! ఇదీ మడిసే కదా' అన్న గేనం ఉండదు కదమ్మా. ఇలా ఎదవ బతుకులు బతికిన కంటే ఇంత ఇసం మింగి సావటం మేలమ్మా" అంది.

అలాగన్నప్పుడు చంద్రి గుండెల ఆవేశంతో ఎగిసి పడింది. ముక్కుపుటాలు అదిరాయి. ముఖం నిండా విషాదం చంద్రుణ్ణి చుట్టిన మబ్బుల్లా ఉన్నాయి. చంద్రి ముఖం ఎండకు వాడిన కుసుమం అయింది. స్వచ్ఛమయిన దాని మనసు పంకిల సదృశమైంది. క్రితం రోజు జరిగిన సంఘటన దాని మనసును కలిచి వేస్తూనే ఉంది.

చంద్రిలాగే పదిళ్ళలో పనిచేసే పారమ్మ చంద్రికి ప్రియ స్నేహితురాలు. మధ్యాహ్నం ఒంటి గంట అయింది. రెండు మెతుకులు తిని మొగుడొస్తే కూడు పెట్టేసి కునుకు తియ్యాలనుకుంది చంద్రి. వాడింకా రాలేదు. కంటికి కునుకు వస్తే అలా సాగోరింది. పారమ్మ వచ్చి చంద్రిని లేపేసింది.

"అవునే, సెంద్రీ. ఎంకటేశ్వరాకి 'నవకుశులు' వచ్చినాదంట. ఎల్దాం వస్తావటే?" అంది.

"నా కాడ డబ్బుల్లేవే. రెండ్రూపాయలుంటే బియ్యం, పావలా ఇచ్చి ఉలవ పిండి తెచ్చి కూడొండి కట్టు కాసేసినాను. మరి డబ్బుల్లేవు. మావొస్తే, ఆడేవైనా డబ్బు లిస్తే రాగలను" అంది.

"ఒసేటే. ఆ మాత్రం టిక్కెట్టట్ట నేనను కున్నావే? నాకా డయిదు రూపాయ లున్నాయి.

బేగి తయారవు. అదిగో, నీ ఆడ బొడుసూ వస్తోంది. అదీ వస్తానంది" అంది, అప్పుడే వస్తున్న చంద్రి ఆడపడుచును చూసి.

చంద్రి ఆడపడుచూ ఆ వీధిలోనే ఉంటూంది. ఆ వీధిలో ఉన్న వాళ్ళంతా లేబరువారే. మగాళ్ళు పగలల్లా రిక్షాలు తొక్కో, కూలీ చేసో డబ్బులు సంపాదిస్తారు. ఆడవాళ్ళు పాచి పనులు చేసి డబ్బులు సంపాదిస్తారు. వాళ్ళని చూస్తే దేశం ఎంత దరిద్ర స్థితిలో ఉందా అనిపిస్తుంది. కానీ వాళ్ళ సరదాలు చూస్తే అలా అనిపించదు. ఏ కొత్త సినిమా వచ్చినా ముందు క్యూలో ఉండేది వారే. వచ్చిన ప్రతి బట్టల మూటల్నీ దింపించి బేరాలు చేస్తారు. చిల్లర చిల్లరగా ఏవో కొనుక్కుని తింటూనే ఉంటారు. 'ఎన్టిఆర్' సినిమా వస్తే చూసినదే అయినా మళ్ళీ మళ్ళీ చూస్తారు ఆడాళ్ళూ, మగాళ్ళూకూడా.

పారమ్మ టిక్కట్టు పెడతాననే సరికి చంద్రికి హుషారొచ్చింది. గబగబా లేచి సబ్బుతో ముఖం కడుక్కుంది. అద్దం ముందు కూచుంది. ఆడపడుచు చంద్రికి జడేసి కొప్పు చుట్టింది. కాటుక దిద్దుకుంది ముఖం నిండా జాలీ పౌడరు దట్టించుకుని. ట్రంకు పెట్టెలోంచి పండక్కు కొన్న నైలెక్సు చీర కట్టుకుని చిలకలా తయారయింది. మొగుడొస్తే అన్నం పెట్టి వెళ్ళటానికి సిద్ధంగా ఉంది.

"వదినమ్మా, అన్నయ్యొస్తే నిన్నిలా సూసి సినిమా క్కొగ్గనేడేమో" అంది.

"పోల్లే సంబడం" అని లోలోన పొంగిపోయింది చంద్రి. చంద్రి మొగుడు ఎప్పటికీ రాలేదు. 'రెండు పుంగా వేసింది.' దానితో ఆత్రత ఎక్కువైంది. ఏం తోచలేదు. తలుపు తాళం వేసింది. తాళం పక్కింటి నూరమ్మ కిచ్చింది. మొగుడొస్తే వడ్డించుకు తినమని చెప్పి సినిమా కెళ్ళిపోయింది.

సినిమా వదిలేసరికి అయిదున్నర అయింది. ఇంటికి రాగానే చీరయినా మార్చుకోకుండా పని లోకి పరుగెత్తింది. పనులు పూర్తి చేసుకొని ఇంటికొచ్చేసరికి ఏడున్నర అయింది. తాగడానికి మంచినీళ్ళు లేవు. కుళాయి ఎప్పుడో కట్టేశారు. గబగబా పూతి కెళ్ళి నీళ్ళు తెచ్చుకుంది. మొగుడు తిని వెళ్ళిన ఎంగిళ్ళెత్తి గిన్నెలు తోమింది. పొయ్యి రాజేసింది. అప్పుడు గుర్తొచ్చింది—ఇంట్లో నూక లేవని. ఎవర్నడిగినా లేవన్నారు.

"ముండా ఈది. ఇలా టేదిలో ఉండేకంటే వసవాల్లో ఉంటే మంచిది" అనుకొని దాకలోంచి చోడిపిండి తీసి అంబలి కాచింది. పది గంట లయింది. ఫస్టు షో వదిలారు. మొదటాట తరవాత కలెక్షన్లు చూసుకొని వచ్చాడు చంద్రి మొగుడు సాంబయ్య. పగలల్లా కష్టపడి దొరికిన డబ్బుల్లో రిక్షా బాడుగ పోగా, మిగిలిన డబ్బుల్తో తప్ప తాగి ఇంటికి వస్తాడు. ఇంకా మిగిలిన రెండో, మూడో ఉంటే అవే ఇస్తాడు చంద్రికి.

ఎప్పటిలాగే వచ్చాడు సాంబయ్య.

కాళ్ళూ, చేతులూ కడుక్కుని అన్నం వడ్డించమన్నాడు.

గిన్నె నిండా అంబలి పోసింది. ప్లేటులో పిండి వడియాలు పెట్టింది. సాంబయ్య ముందుకు తోసింది. ఆవురావురు మంటున్న సాంబయ్యకి అంబల్ని చూసేసరికి ఎక్కడలేని కోపం వచ్చింది. కాల్తో అంబలి గిన్నెని ఒక్క తాపు తన్నాడు. "లంజకూతరా! పగలల్లా పచ్చి సెడి ఇంటికొస్తే అంబలంటే నువ్వెట్టేది?" అన్నాడు.

చంద్రికీ పౌరుషం వచ్చింది. "ఏం? ఏ నీ మొగుడు గడించిన ఆస్తి ఇక్కడుందని నీ కంత పొగరు? నీ జిమ్మొమ్మడ. నోటి ముందు కూటిన్ని కాల్తో తన్నావు గదరా? నీకా అంబలి కూడా నేకుండా పోగలదురా! ఏం? అంత మహారాజా భోజనం పెయ్యా లనుకున్నోడివి తప్పతాగి రాపోతే ఆ డబ్బు లెచ్చి పెళ్ళాం సేతుల్లో పోయాలని తెలీదా? నీ క్కోడి కూర పెట్టనా? సేపల పులుసెయ్యనా?" అంది.

"ఏటే పేల్తన్నావ్? మళ్ళీ అను. ఆ దవడ పళ్ళూడ గొట్టకపోతే నా పేరు సాంబయ్యే కాదనుకో" అని విసురుగా లేచాడు.

"ఏం? నాకేటి బయమా? ఉన్న మాటంటే ఎంత ఉలుకు వచ్చేసినాదమ్మా మొగోడికి? మళ్ళీ అంటాను. నీ కింత కోడికూరలూ, సేపల పులుసూ కావాలంటే ఆ డబ్బులెత్తిచ్చి నా సేతుల్లో పెట్టు.

అపూర్వరుచి! -తియ్యదనం!

స్వస్తిక్స్

స్వస్తిక్స్‌వారి అతిరుచికరమైన గులాబ్ జామున్ మిక్స్

ఉచితం
ఒక్కొక్క 200 గ్రాం. ప్యాకెట్ తో స్త్రీలకు చేతిగుడ్డ ఒకటి ఇనామ్
ఒక్కొక్క 100 గ్రాం. ప్యాకెట్ కు ఒక నోటు పుస్తకము ఇనామ్

స్వస్తిక్ బంగారువన్నె
గులాబ్‌జామున్ రుచి
అనితరము, అపూర్వము,
మనోహరము
మామూలు భోజనాన్నయినా
విందుగా మార్చగల
వంటకం




స్వస్తిక్స్ కెమికల్ ఇండస్ట్రీస్
స్వస్తిక్ హవుస్
23/1, జైన్ టెంపుల్ స్ట్రీట్,
వి.వి. పురం,
బెంగుళూరు-560 004

తప్పతాగి తందనా లాడ్డంగాదు'' అంది. ఆదా వ్మాటవేపరికి చివాలున లేచి ''ఏటే? ఏటి పేల్తున్నవే, ఎదవ వాకూతరా! నీకు సినిమాకీ, సికార్లకీ డబ్బు లుంతాయా? మొగుడి క్కూడొండనానికి డబ్బు ల్నేవటే? నాకు నీతుల్చెప్పేనంత దాని వయినావటే?'' అని మెడ వంచి దభీ దుభీ దభీ దుభీ మని వరుసగా బాదాడు. బలంగా పట్టుకున్న వాడి చేతిలోంచి దాని జుట్టుని విడిపించుకుంటూ ''ఒగ్గుతావా? ఒగ్గవా? నీకే పెప్పేది?'' అని పులిలా మీద పడబోతున్న వాణ్ణి ఒక్క తోపు తోసింది.

అరగంటసేపు ఇద్దరూ పెనుగులాడారు. సాంబయ్య చంద్రిని చావ మోదాడు. చంద్రి జూలు విదిలించుకున్న సింహంలా, ఈనిన పులిలా సాంబయ్య మీదికి ఉరికింది. కోపంతో రక్కింది. గట్టిగా కరిచింది. వాడల్లో అందరూ మూగారు. ఆడవాళ్ళందరూ చంద్రికి సపోర్టు ఇచ్చారు. చంద్రి అంటే ఆ వీధిలో మగాళ్ళకి వో భయం ఉంది. అందునుంచి కొంతమంది మగాళ్ళు సాంబయ్యకి సపోర్టిచ్చారు. చంద్రి కోపం అణుచుకోలేక పోయింది.


''బేవార్సు ఎదవల్లారా! అడికి సపోర్టిస్తన్నారంట్రా. అవునూ, మీరూ అందరి పుట్టినోళ్ళే కదా! తప్ప తాగి సిల్లిగవ్వ నేకంటా ఇంటికొస్తే ఎవుడబ్బ సొమ్ము తెచ్చి మీా కెట్టమంటార్రా? నేక మీా పెళ్లాలు ఎవులుకాడేనా సదుసుకొని తెచ్చి మీకు పెట్టమంతార్రా? మీకు బుద్దుల్నేవట్రా? మీకు సిగ్గూ సెరం నేదట్రా?ఇదిగో. ఇయ్యాల్టినించి సెపుతన్నా. నానేకాదు. ఈ వోడలో ఎవులేనా సరే ఆడదాయి మీద సెయి సేసుకున్నారో మక్కా లిరిగి పోగలవు. అంతేకాదు. మీరు గడించిన డబ్బులు మా సేతులో పెట్టి ఆయెనక మీా రెలా తగలడతారో తగలడండి'' అంది. బుసలు కొడుతూ చెప్పిన చంద్రి మాటలకి అందరూ వంత పలికారు. తోక ముడుచుకున్న కుక్కల్లా ఒక్కొక్కరూ జారుకున్నారు. సద్దుమణిగింది.

జరిగిన సంగతంతా చెపుతూంటే గిరిజ ఆశ్చర్యంతో ఉండిపోయింది. చంద్రిని చూస్తూంటే గిరిజకి చాలా ఆనందం కలుగుతోంది. ''చంద్రీ! నువ్వలా ఎదురు తిరిగితే మీా ఆయన వూరుకున్నాడా'' అంది అమాయకంగా.

''వూరుకో కేం చేస్తాడమ్మా. ఉరెట్టుకుంటాడా? పీక తీస్తాడా? అమ్మా, ఈ మొగల్లకి బయపడినంత కాలం ఆడదాయి ఇలా వంచుతునే ఉంటారు. పిల్లిని కూడా తలుపులేసి కొడితే తిరగబడతాదని అల్లకి మాత్రం తెలీదటమ్మా. ఆడదాయి వోరిసినంత కాలం వోరుస్తాది. మన సిరిగిందో, అమ్మోరవుతాది'' అంటున్న చంద్రిని మరింత ఆశ్చర్యంగా చూసింది. ఇంట్లోకెళ్ళి ఫ్లాస్కులో కాఫీని గ్లాసులో పోసి చంద్రి కిచ్చింది గిరిజ. కాఫీ తాగి వస్తానంటూ వెళ్ళిపోయింది.

వాలు కుర్చీలో వాలిన గిరిజ చెవుల్లో చంద్రి అన్న మాటలే గింగుర్లు పెడుతున్నాయి. నిజమే! చంద్రినించి నేర్చుకోవలసింది ఎంతో ఉందని పించింది.

చంద్రికి చదువు లేదు. డబ్బు లేదు. సంస్కారం




లేదు. కానీ తెగింపు ఉంది. తన జీవితాన్ని రక్షించుకో గలిగిన శక్తి ఉంది. ధైర్యం ఉంది.

కానీ — తనకో?

''చదువు ఉంది. డబ్బు ఉంది. అంతస్తులున్నాయి. తెలివి తేట లున్నాయి. కానీ తెగింపు లేదు. జీవితం చిరిగిన విస్తరవుతుంటే దాన్ని సరిచేసుకునే శక్తి లేదు.

గిరిజ తండ్రి బాగా డబ్బున్న వాడు. తండ్రికి గిరిజ ఒక్కతే కూతురు. గిరిజని అల్లారుముద్దుగా పెంచాడు తండ్రి. పువ్వు కంటే కోమలంగా చూసుకున్నాడు. గిరిజ బి ఎస్సీ వరకూ చదువుకుంది. కాలేజీ రోజుల్లో గిరిజ చేసిన అల్లరి విపరీతం. మగ పిల్లల్ని తెగ ఏడిపించేది.

బి ఎస్సీ అయిన తరవాత లక్ష రూపాయల కట్నం పోసి తన కంటే బాగా ఆస్తి ఉన్న లక్ష్మణ రావుతో కూతురి పెళ్ళి జరిపించాడు గిరిజ తండ్రి. లక్ష్మణరావుకూడా పాలిటెక్నిక్ సివిల్ పాసయి కొన్నాళ్ళు ఉద్యోగం చేశాడు. కానీ దాని వలన ప్రయోజనం లేదని ఉద్యోగానికి రిజైన్ చేసి కాంట్రాక్టులు చేపట్టాడు. కాంట్రాక్టులు చేపట్టిన దగ్గరనుండీ లక్ష్మణరావు వ్యక్తిగతంగా బాగా మారిపోయాడు. క్షణం తీరిక లేకుండా అయాడు.

పెళ్ళయిన మొదటి సంవత్సరం గిరిజకి బాగా గడిచిపోయింది. తరవాత కొడుకూ, మరో సంవత్సరానికి కూతురూ పుట్టారు. అక్కడితో గిరిజ జీవితంలో సుఖానికి పులుస్టాపు అయింది. లక్ష్మణరావు ఇంటి కొచ్చేసరికి రాత్రి ఒంటి గంటా రెండూ అయేది. ఇంటి కొచ్చేసరికి మంచి నిషాలో వచ్చేవాడు. తరవాత భోజనం కూడా చేసేవాడు కాదు. భర్త వస్తే కలిసి భోజనం చేదామనే గిరిజకి నిరాశే ఎదురయేది. తరవాత ఇంటి దగ్గరే తాగటం మొదలు పెట్టాడు.

ఒక రోజు లక్ష్మణరావుతో ఘర్షణకి దిగింది గిరిజ. తాగబోతున్న అతని ముందు నుంచి సీసా గ్లాసులూ లాగేసింది. వీల్లేదంది. లక్ష్మణరావు ఎంత చెప్పినా వినలేదు. కొంత సేపు కేక లేసుకున్నారు. తరవాత గిరిజ చెంప చెళ్ళుమంది. అది గిరిజ వూహించని పరిణామం.

పౌరుషంతో గిరిజ ముఖం కందిపోయింది. కళ్ళు అగ్ని గోళాలు అయాయి. తోక తొక్కిన తాచయింది. ఉరిమిన మేఘం కుంభవృష్టి కురిసినట్లు తరవాత వెక్కి వెక్కి ఏడిచింది. ''తాగండి! మీా ఇష్టం వచ్చినట్లు తాగండి. అంతేకాదు. ఇంకేం వేషాలేయాలనుకుంటున్నారో అన్నీ వేయండి. ఇవాల్టినుంచి మీారేంచేసినా ఎన్నివెధవ పనులు చేసినా మిమ్మల్ని అడిగితే ఒట్టు. భార్యని కొట్టే నీచస్థితికి దిగి జారారు. మీారూ ఒక మనిషేనా?'' అని అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది. ఆ రాత్రల్లా ఏడుస్తూనే ఉంది.

రోజులు గడిచే కొద్దీ గిరిజ బతుకు మరింత నరకం అయింది. లక్ష్మణరావుతో ఇంటికి అప్పుడప్పుడు అందమైన అమ్మాయిలు వస్తుంటారు. వాళ్ళు చాలా సేపు మేడ గదిలో కూర్చుంటారు. తాగుతారు. కేరింతలు కొడతారు. వెళ్ళిపోతారు.

అయితే వారెవరనీ, ఎందు కొచ్చారనీ గిరిజ లక్ష్మణరావుని ప్రశ్నించలేదు. గిరిజ మనసును రాయి చేసుకుంది. జీవితం యాంత్రికం అయింది.

ఇప్పుడు గిరిజలో వెనుకటి ఉత్సాహం లేదు. హుషారు లేదు. ఏ పనీ చేయాలన్న ఉత్కంఠ లేదు.

గతం కళ్ళ ముందు తిరిగిన గిరిజ మనసు బాధతో నలిగిపోయింది. కన్నీరు వరదలై పారింది.

''కాలేజీలో చదువుకునే రోజుల్లో వరకట్న నిషేధం మీాదా, విమెన్ లిబర్టీ మీాదా ఎన్నెన్నో ఉపన్యాసా లిచ్చేది! అవన్నీ జీవితానికి ఎందుకు వర్తించకుండా పోయాయి? తనలో ఎందు కింత పిరికితనం చోటు చేసుకుంది. వైరాశ్యం గూడు కట్టుకుంది. చంద్రిలాగా తెగించి ఎదురు తిరిగితే లక్ష్మణరావు ఏం చేయగలడు?''

చంద్రి లాగా ఎదిరించాలన్న తెగింపు వచ్చిన గిరిజకి కొండంత బలం వచ్చింది. తెలియని ఉత్సాహం వచ్చింది. కొత్త ఆశ చివురు తొడిగింది. ❋